29న పవర్‌లిఫ్టింగ్ పోటీలు 7

నేడు, రేపు దిండి-చించినాడ వంతెనపై రాకపోకల నిలుపుదల 7

50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక 7


# డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

- తదుపరి తేదీ త్వరలో వెల్లడిస్తాం
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఇది సోమవారం జరగాల్సి ఉండగా వాయిదా వేశామని, తదు పరి తేదీని త్వరలో వెల్లడిస్తామని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఈపరిశీలన జరగాల్సి ఉంది. దీని నిమిత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెరిట్ జాబితాలోఉన్న 1241 అభ్యర్థులు పరిశీలనకు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. దీనికోసం ఆదివారం సాయంత్రం బందోబస్తు ఏర్పాట్లను పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ పరిశీలించారు. కానీ, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు ఆదివారం రాత్రి కాకినాడ డీఈవో ప్రకటన విడుదల చేశారు. పరిశీలన తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

## నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం అమలాపురం పట్టణంలో పర్యటించనున్నట్టు జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు అమలాపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలో చాయ్‌పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని చెప్పారు. ఉదయం 10 గంటలకు గడియార స్తంభం సెంటర్ నుంచి కాపు కల్యాణ మండపం వరకు శోభాయాత్ర ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం శుభగృహ కన్వెన్షన్ హాలులో మేధావులతో సమావేశం నిర్వహిస్తామని సత్యనారాయణ తెలిపారు.



ఆలమూరు మండలం జొన్నాడ రెండు బ్రిడ్జిల మధ్య వరద పరిస్థితి

# బార్‌మంటున్నారు!



## బార్‌లకు ముందుకురాని వ్యాపారులు

- నష్టపోతామని వెనుకంజ
- ఇక మిగిలింది రెండు రోజులే
- 46 బార్లకు 11 ఎన్‌రోల్‌మెంట్లు
- దరఖాస్తులకు ఎక్సైజ్ శాఖ పట్టు
- మద్యం దరఖాస్తుదారులకు మెసేజ్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రండి బాబు.. రండి.. దరఖాస్తు చేయండి.. మంచి తరుణం మించిన రాదు..అంటూ గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లందరికీ ఎక్సయిజ్ అధికారులు వేలల్లో మెసేజ్‌లు పంపుతున్నారు. దాబాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేయమని వేడుకుంటున్నారు. అయితే కొత్త బార్ పాలసీకి సంబంధించి వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.. ఎక్సైజ్ అధికా రులు మాత్రం దరఖాస్తులు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 బార్‌లకు నోటి ఫికేషన్ విడుదల చేయగా ఇప్పటి వరకూ కేవలం 11 ఎన్‌రోల్‌మెంట్లు మాత్రమే జరిగాయి.అయినా ఒక్కో బార్‌కి 10 దరఖాస్తులు వస్తాయని ఎక్సయిజ్ అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ నెల 26 (మంగళ వారం) దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఇంకా మిగి లింది రెండు రోజులే..అయినా ఎన్‌రోల్‌మెంట్ చూస్తేనే నీరసంగా ఉంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1 నుంచి బార్‌లు ఉంటాయా.. అనే సందిగ్ధం ఫుల్‌గా ఉంది.

### ఇవీ వ్యాపారుల లెక్కలు

రాజమహేంద్రవరంలో ఒక బార్‌కు దరఖాస్తు చేయాలంటే ఖర్చు ఇలా ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసుకుంటు న్నారు..ఒక్కో షాపునకు 4 దరఖాస్తులు తప్పనిసరి.. మూడు దరఖాస్తులు వచ్చినా లాటరీ ఉండదు. ఆ లెక్కన సిండికేట్‌గా 4 షాపులకు దరఖాస్తు చేయాలి.అంటే ఫీజు రూ.20.40 లక్షలు, లైసెన్స్ రుసుం ఏడాదికి రూ.55 లక్షలు, ఇష్యూ ప్రైస్‌పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సయిజ్ టాక్స్ (ఏఆర్‌ఈటీ) సుమారు రూ.54 లక్షలు, నెలకు బార్ అద్దె రూ.1.25 లక్షలు, కరెంటు బిల్లు రూ.30 వేలు, రవాణా రూ.30 వేలు, జీతాలు రూ.1.50 లక్షలు, సివిల్ పోలీ సులకు నెలకు రూ.15 వేలు, ఎక్సయిజ్ వాళ్లకు రూ.50 వేలు..ఇలా మొత్తం కలిపి సుమారు రూ.1.80 కోట్లు ఏడాదికి వెచ్చించాల్సి ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసి చూపిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి తాము నష్టపోకుండా ఉండాలంటే రోజుకు కనీస అమ్మకం రూ.3 లక్షలు ఉండాలని, అలా ఉండాలంటే క్వార్టరుపై కనీసం రూ.50 అదనంగా అమ్మినా కష్టమేనని, ప్రైవేటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉండగా అంత సొమ్ము అదనంగా చెల్లించి బార్‌లకు ఎవరు వస్తారని అంటున్నారు. పక్క రాష్ట్ర మైన తెలంగాణలో దరఖాస్తు ఫీజు రూ.1 లక్ష మాత్ర మేనని ఉదాహరణ చూపెడుతున్నారు.

### బార్లు ఫుల్.. ఎన్‌రోల్‌మెంట్ నిల్

కొత్త బార్‌లకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ నీరసంగా నడుస్తోంది. బార్‌ల లాటరీలో పాల్గొనాలంటే తొలుతగా ఉచితంగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలి. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లిస్తే ప్రక్రియ మొదలవుతుంది. అనంతరం రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించిన వారికి లాటరీలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. అయితే ఉచితమైనప్పటికీ ఎన్‌రోల్‌మెంట్ అత్యంత నీరసంగానే సాగుతోంది. ఇంకా 2 రోజులే సమయం ఉన్నా కనీసం ఒక్క దరఖాస్తు సమర్పించలేదు.ఈ నెల 23న సాయంత్రం సమయానికి డా.బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు 9 బార్‌లు కేటాయించగా ఎన్‌రోల్‌మెంట్లు 4 జరిగాయి. ఇద్దరు మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు.తూర్పు గోదావరి జిల్లాలో 22 షాపులకు మూడు ఎన్‌రోల్‌మెంట్లు జరగ్గా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించలేదు. కాకినాడ జిల్లాకు సంబంధించి 15 బార్‌లకు ఐదుగురు మాత్రమే రిజిస్టరు అయ్యారు. ఒక్కో షాపునకు రూ.5.10 లక్షల చొప్పున దరఖాస్తు ఫీజును చెల్లించి 4 దరఖాస్తులు సమర్పించాలని తొలుత ప్రభుత్వం నిబంధన విధిం చినా వ్యాపారుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని దానిని సడలించింది. లాటరీలో షాపు దక్కించుకొన్న దరఖాస్తు మినహా మిగతా వారికి ఆ సొమ్ములు తిరిగి చేస్తామని ఎక్సైజ్ కమిషనర్ ప్రకటించారు. అయినా ఎన్‌రోల్‌మెంట్ మాత్రం నీరసంగానే సాగుతోంది. ఎక్సయిజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ శనివారం జిల్లాకు రావడంతో ఆయనతో సమావేశమై ఇబ్బందులను వివరించవచ్చని బార్ వ్యాపారులు ఆశించినా ఫలించలేదు.

### నిబంధనలు మార్చాలి..

బార్ పాలసీలో మార్పులు చేయకపోతే నెలకు కనీసం రూ.10 లక్షల వరకూ నష్టం భరించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.పక్క రాష్ట్రంలోని హైదరాబాద్, సికింద్రాబాద్ మెట్రో సిటీల్లో సైతం రూ.40 లక్షల వార్షిక ఫీజు ఉండగా 22 శాతం మార్జిన్ సదుపాయం ఉంది.అయినప్పటికీ అక్కడా నష్టాలు భరిస్తున్నారు.బార్ ఏర్పాటుకు ఫర్నిచర్, సామగ్రి వంటి వాటికి లక్షల్లో పెట్టుబడి పెట్టా లి. అందువల్ల వార్షిక లైసెన్సు ఫీజులో ఎంతో కొంత పెంపుదల చేసి అప్పటికే ఉన్న బార్‌లను కొనసాగిస్తారు.ఇదే విధానం తెలంగాణలో ఉన్నా నష్టాలు వస్తున్నాయి. ఏపీలో ఇప్పుడు మూడేళ్లలో లైసెన్స్ అంటున్నారు. తర్వాత మళ్లీ లాటరీ అంటే.. తమకు షాపు రాకపోతే లక్షల రూపాయల సామగ్రి, ఫర్నీచర్ ఏం చేసుకోవాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఆ నిబంధన మార్చాల ని డిమాండ్ చేస్తున్నారు.

# వరద తగ్గుముఖం



పి.గన్నవరం మండలం కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై రాకపోకలు సాగిస్తున్న లంకగ్రామాల ప్రజలు

- తేరుకుంటున్న లంక గ్రామాలు
- ఉద్యాన పంటల నష్టాల అంచనాల్లో అధికారులు
- నర్సాపురం-సఖినేటిపల్లి రేవు మధ్య పంటు రాకపోకలు పునరుద్ధరణ

అమలాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. భద్రాచలం, ధవళేశ్వరంవద్ద వరద ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించడంతో కోనసీమ జిల్లాలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో ప్రవాహం శాంతించింది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అయినా జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ముంపునకు గురైన కాజ్‌వేలు ఇంకా వరద దిగ్బంధంలోనే కొనసాగుతున్నాయి.

పి.గన్నవరం మండలంలోని అప్పనపల్లి కాజ్‌వే, చాకలిపాలెం,ఎదురుబిడిం కాజ్‌వేలవద్ద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ సోమవారం నుంచి రాకపోకలు పునరుద్ధరణ అయ్యే అవకాశం ఉంది. కాజ్‌వేలపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టి మార్గాలను సుగమం చేయాలని లంకగ్రామాల ప్రజలు కోరుతున్నారు. సోమవారంనుంచి వశిష్ఠనదిపై నర్సాపురం-సఖినేటిపల్లి రేవు మధ్య పంటు రాకపోకలు పునరుద్ధరించనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో మూడురోజులుగా నిలిచిపోయిన రాకపోకలు ప్రారంభం కానుండడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకోనున్నారు. వరదలవల్ల ముంపునకు గురైన లంక గ్రామాల్లోని ఉద్యాన పంటల నష్టాలను అంచనా వేసేందుకు అధికారుల బృందాలు రంగంలోకి దిగనున్నాయి. జిల్లావ్యాప్తంగా వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ చర్యలు చేపట్టేందుకు పంచాయతీలు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మంచినీటి కాలుష్యం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వైరల్ ఫీవర్లు పెరుగుతున్నందున ప్రజలు ముందు జాగ్రత్తగా వేడినీళ్లు తాగడంతోపాటు ఫీవర్ వచ్చిన వారు దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలు, ఇతర ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలని అధికారులు కోరుతున్నారు. అయితే సోమవారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండడంతో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# వరదనీటిలో ఉద్యాన పంటలు



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున జలదిగ్బంధంలో అరటితోట

- ఆవేదనలో రైతులు
- ఆరు మండలాల్లో మునిగిన పంటలు
- జిల్లావ్యాప్తంగా 3,361 ఎకరాల్లో ఉద్యాన పంటల వరద నీటమునక

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోదావరికి వచ్చిన వరదపోటుతో లంకగ్రామాల్లో పంటలు నీటమునిగాయి. అత్యధిక శాతం రైతులు తమ భూముల్లో పచ్చిమిర్చి, బీర, బెండ, వంగ, ఆనబ, మునగతోపాటు వాణిజ్య పంటలైన తమలపాకు, పసుపు, అరటి, బొప్పాయి, కోకో తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటలన్నీ వరదనీటిలో మునిగి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద తాకిడికి లంకల్లో ఉన్న పచ్చికబయళ్లు ధ్వంసం కావడంతో పశువులకు పశుగ్రాసం కోసం ఎండిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది.

వరదల కారణంగా జిల్లాలోని ఆరు మండలాల్లో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంచనాలు రూపొందించారు. కొత్తపేట, కపిలేశ్వరపురం, పి.గన్నవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, కె.గంగవరంల్లో 3,361 ఎకరాల్లో ఉద్యాన పంటలు నీటమునిగాయని అంచనా వేస్తున్నారు. వరద తగ్గిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయిలో నష్టం వివరాలు నమోదు చేయనున్నారు.

## అమలాపురంలో తొలిసారిగా

- పట్టణంలోలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు
- కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు తొలివిడత అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అమలాపురం డిగ్రీ కళాశాల కొత్తగా చేరింది. బీకాం మొదటి సంవత్సరంలో చేరేందుకు 60 సీట్లు, బీఏ, బీఎస్సీ కోర్సుల్లో 40 సీట్లు చొప్పున మొత్తంగా 140 సీట్లు కేటాయించారు. డిమాండ్ ఎక్కువుంటే బీఏ, బీఎస్సీ గ్రూపుల్లో కొత్తకోర్సులు చేర్చిఅదనంగా 30 చొప్పున 60 సీట్లు కేటాయించే అవకాశం ఉంది.

### 26లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 20న ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ నెల 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. 29న వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంది. 31న ఆయా విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుంది. సెప్టెంబరు 1 నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభిస్తారు.

### పేరూరు జడ్పీ పాఠశాల పరిశీలన

అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణ స్థలంలో నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటివరకు జడ్పీ ఉన్నత పాఠశాల అదనపుతరగతి గదుల్లో డిగ్రీ కోర్సులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలోభాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి,విద్యాకమిటీ చైర్మన్ వీరవెంకటసత్యనారాయణలతో కలిసి ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహస్వామి బృందం తరగతి గదులను ఆదివారం పరిశీలించింది.ఈనెల 26నుంచి కేటాయించిన తరగతి గదుల్లో అధ్యాపకులు డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేపడతామని డాక్టర్ నరసింహస్వామి తెలిపారు. వారి వెంట అధ్యాపకుల బృందం పి.కరుణశ్రీ, డాక్టర్ ఎం.బాలాస్వామి, డాక్టర్ బి.ఆశిష్‌బాబు, తోటమురళీకృష్ణ, పి.శేఖర్ ఉన్నారు.



పేరూరులో తరగతి గదులు పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ చంద్రమౌళి, అధ్యాపకులు

## ఇక స్మార్ట్ రేషన్‌కార్డులు

- వచ్చేనెల 6న స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీ
- జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఉదయభాస్కర్

ముమ్మిడివరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ బెస్ట్ స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీకి సిద్ధం చేసినట్టు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చిందని ఆయన చెప్పారు. వచ్చేనెల 6న ఈ స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. చౌకధరల దుకాణాల నిత్యావసర పథక లబ్ధిదారులకు పంపిణీ చేసిన రేషన్ గుర్తింపు కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసిందన్నారు.

కోనసీమ జిల్లావ్యాప్తంగా 5,31,926 రేషన్‌కార్డుదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నట్టు డీఎస్‌వో ఉదయభాస్కర్ తెలిపారు. అర్హులందరికీ కొత్తరేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ మేరకు కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏటీఎం కార్డు పరిమాణంలో వీటిని రూపొందించారన్నారు. కార్డు ముందువైపు రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, కుటుంబ పెద్ద చిత్రం, రేషన్‌దుకాణ సంఖ్య, క్యూఆర్ కోడ్ వంటి సెక్యూరిటీ ఫీచర్లు ఉంటాయన్నారు. ఇ-పోస్ నూతన యంత్రాల సాయంతో కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబానికి సంబంధించి తీసుకోని సరుకుల వివరాలన్నీ కనిపించేలా కార్డును డిజైన్ చేశారన్నారు. కుటుంబ పెద్ద ఫొటోతోపాటు కుటుంబ సభ్యుల పేర్లు, వివరాలు, దీనిద్వారా లబ్ధిదారుల గుర్తింపు మరింత తేలిక అవుతుందన్నారు. కార్డుదారులకు దుకాణాలవద్ద గంటల కొద్దీ వేచి చూడాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డులు ఆయా ముద్రణ సంస్థల కార్యాలయాలనుంచి ఇప్పటికే జిల్లాలోని మండలానికి పంపిణీ జరుగుతోందని డీఎస్‌వో తెలిపారు. పాతకార్డులున్న వారితో సహా కొత్తవారికి ఈ రేషన్‌కార్డుల పంపిణీ చేయనున్నారన్నారు. అర్హతే ప్రధాన ఏకైక ప్రామాణికంగా కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అర్హత జాబితాలో తమ పేర్లను నిర్ధారణ చేసుకునే అవకాశం కూడా ప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా కల్పించిందన్నారు. ఇందుకు అనుకూలంగా జాబితాలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచిందన్నారు. లబ్ధిదారులు జాబితాలో పేర్లకోసం పౌరసరఫరాలశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమయంలో పొందిన నెంబరును నమోదు చేయాలన్నారు. దీంతో రేషన్‌కార్డు దరఖాస్తు ఏ దశలో ఉందో సమాచారం తెలుస్తుందన్నారు. స్మార్ట్‌రేషన్‌కార్డుల వల్ల నిత్యావసర వస్తువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందన్నారు. కొత్త స్మార్ట్‌కార్డుల ఆధారంగా లబ్ధిదారులు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు తీసుకోవచ్చునన్నారు. త్వరలో స్మార్ట్ ఇ-పోస్ మిషన్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఇప్పుడు అందిస్తున్న స్మార్ట్‌కార్డులను ఈపోస్ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుల వివరాలు వస్తాయని, వైఫై, హాట్‌స్పాట్, బ్లూటూత్ వంటి అధునాతన సదుపాయాలతో, ఆండ్రాయిడ్ సాంకేతికతతో నూతన వ్యవస్థ పనిచేస్తుందని డీఎస్‌వో తెలిపారు.

## సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం ఆర్జితసేవయిన రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొనివచ్చి వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన టేకురథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

## డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై...

### లంకలగన్నవరంలో డాక్యుమెంటరీ చిత్రీకరణ

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అపర అన్నపూర్ణగా ప్రసిద్ధిగాంచిన డొక్కా సీతమ్మ జీవి త చరిత్రను ఇప్పటికే వివిధ రూపాల్లో తెరకెక్కించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు పలు తరగతుల పాఠ్య పుస్తకాల్లో ప్రచురించారు. తాజాగా గౌరి ప్రసాద్ మీడియా బ్లాక్అండ్‌వైట్ మూవీ మార్క్ సంస్థ అన్నపూర్ణతల్లి బువ్వమ్మ పేరుతో డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నారు. డైరెక్టర్ సురేష్ లంకలపల్లి నూతన నటీనటులతో పలు దృశ్యాలను ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని లంకలగన్న వరంలో గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అడిగినవారికి లేదనకుండా అన్నం వండి వడ్డించేవారని.. ఆమె జీవిత విశేషాలు, అపురూప ఘట్టాలను తెరకెక్కిస్తున్నామన్నారు. 2రోజులు పాటు లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం, గోదావరి నదిపరివాహక ప్రాంతాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయో ధ్యలంకలో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తామని చెప్పారు. ఈ డాక్యుమెంటరీకి నిర్మాతగా సీరాజ్, ఖాదర్ వ్యవహరించగా సింహరాశి డైరెక్టర్ సముద్ర, షిలిక లేనౌజా, ఆదిల్, రమేష్, కుసుమ తదితర నూతన నటులు నటిస్తున్నారని.. సంగీతం సాకేత్‌వేణి అందించగా ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంటరీని అక్టోబర్‌లో విడుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పి.శ్రీనివాస్ స్పష్టం చేశారు.



లంకలగన్నవరం కోడేరు రేవు వద్ద ఓ సన్నివేశం చిత్రీకరణ

## పెద్దది.. బాగున్నది!

### ఆకట్టుకున్న సీతాకోకచిలుక



పెద్ద సైజులో ఉన్న సీతాకోక చిలుకను ఫొటో తీసుకుంటున్న ప్రజలు

వై.రామవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతాకోకచిలుకలు సహజంగానే అందంగా కనిపిస్తాయి. అల్లూరి జిల్లా వై.రామవరం- యార్లగడ్డ గ్రామాల మధ్య రహదారి పక్కన చెట్టు ఆకుల మధ్య ఉన్న కాండానికి పెద్ద సైజు సీతాకోక చిలుక వేలాడుతూ చూపరుల దృష్టి ని ఆకర్షించింది. దీని రెక్కల వెడల్పు అటు నుంచి ఇటు 8 అంగుళాలు ఉంది.



### ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు

## న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అమలాపురం టౌన్ ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పూణేలో ఈనెల 26 నుంచి 31వరకు జరిగే ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావును న్యాయనిర్ణేతగా నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. మరోసారి న్యాయనిర్ణేతగా నియామక పత్రాలను అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిమంత బిశ్వాశర్మ, ప్రధాన కార్యదర్శి సంజయ్ మిశ్రాల నుంచి అందుకున్నారు. శ్రీనివాసరావు నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన థామస్ ఊబర్‌కప్, వరల్డ్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా, ఆల్‌ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్లతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ప్రపంచస్థాయిలో క్రీడాకారుల ఎదుగుదలకు ఎంతో ముఖ్యమైన ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయడం పట్ల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాబు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎస్డీవో పీఎస్‌సురేష్‌కుమార్, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు పలువురు అభినందించారు.

## కారు, బస్సు ఢీ : లారీ క్లీనర్ మృతి

శంఖవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోతే సూరిబాబు (42) మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన సూరిబాబు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి తుని వైపు వెళ్తున్న కారు, బస్సు వెంటవెంటనే ఢీకొనడంతో అక్కడికక్కడే క్లీనర్ మృతి చెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అన్నవరం ఎస్ఐ

## టాటా ఏస్ ట్రక్కు ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన నరేష్

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన ముప్పిడి నరేష్ (26) గుడ్డిగూడెంలో ఉన్న అక్క నాగలక్ష్మిని, ఆరుగొలను బాలాతల్లి భవానిని చూడడానికి ఇద్దరూ కలిసి బైక్‌పై బయలుదేరారు. గోపాలపురం మండలం సాగిపాడు శివారున టాటా ఏస్ ట్రక్కు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాపాక బాలాకుమార్ కాలుకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో తోగుమ్మిలో విషాదఛాయలు అలముకున్నాయి.

## ఐషర్ వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి



వీరరాఘవులు (ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ చలమల రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వానపల్లిపాలెంకు చెందిన కోలా వీరరాఘవులు(75) ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం సైకిల్‌పై వెళ్తుండగా ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొనడంతో వీరరాఘవులు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## బైక్ ఢీకొని మహిళ మృతి

### నరేంద్రపురం జంక్షన్ వద్ద ఘటన

రాజానగరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 16వ వార్డుకు చెందిన అనిశెట్టి లత(33) రాజానగరంలో బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరింది. రాజానగరం సమీపంలోని నరేంద్రపురం జంక్షన్ వద్ద నడుచుకుంటూ హైవే దాటుతుండగా దివాన్‌చెరువు వైపుగా వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో లత తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా లత భర్త అనిశెట్టి శ్రీను బండిపై టిఫిన్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గాయత్రి ఇంటర్మీయట్ పూర్తి చేయగా, చిన్న కుమార్తె కావేరి ఇంటర్ మొదటి ఏడాది చదువుతోంది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

### నలుగురి అరెస్ట్.. రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ స్వాధీనం



క్రికెట్ బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నార్త్‌జోన్ పరిధిలో స్థానిక పోలీసులు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు కోరుకొండ మండలం కాపవరంలోని ఓ ఇంట్లో నిర్వహించిన దాడుల్లో బెట్టింగ్ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్‌కి పాల్పడుతున్న ప్రధాన నిందితుడిగా గుర్తించిన విశాఖ పట్నానికి చెందిన రాకేష్ పరారీలో ఉన్నాడని.. బెట్టింగ్‌కు పాల్పడిన గోసంశెట్టి వీరప్రసాద్, జాజుల బాలచక్రం, నల్లల లక్ష్మీనరసయ్య, కొడతాల నానాజీని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బందికి రివార్డు అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ వైసత్యకిషోర్, ఎస్ఐ కేవీ నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 29న పవర్‌లిఫ్టింగ్ పోటీలు



పవర్‌లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలు, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు పవర్‌లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో జరిగే పోటీల వివరాలను జిల్లా ఒలింపిక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి వివరించారు. సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా 30 కేటగిరీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ మెడల్స్ చాంపియన్ షిప్ ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల ట్రోఫీలు, చాంపియన్స్ మెడల్స్‌ను ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ఆవిష్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు కల్వకొలను బాబు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ట్రోఫీల స్పాన్సర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరెడ్డి రాము, యెరుబండి చంటి, గొలకోటి నారాయణరావు, నార్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై మేల్ నర్స్ అకృత్యాలు

- తనతో ఉండాలని వేధింపులు
- ఫొటోలను మార్ఫింగ్ చేసి బాధితురాలి కొడుక్కి పంపిన వైనం
- కాకినాడ వన్‌టౌన్ పీఎస్‌లో కేసు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్స్‌గా పనిచేస్తున్న సందీప్ అనే వ్యక్తి ఓ మహిళపై అకృత్యాలకు పాల్పడాడు. అతడు చేస్తున్న దారుణాలపై ఆ మహిళ ఆదివారం సాయంత్రం కాకినాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారురాలి భర్త కొంతకాలం క్రితం మరణించాడు. ఆమె మనోవేదనకు గురైన సమయంలో కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పనిచేస్తున్న సందీప్ దగ్గరయ్యాడు. సహజీవనం పేరుతో ఆమెతో చనువు పెంచుకున్నాడు. నాటి నుంచి బాధితురాలికి తెలియకుండా స్నానం చేస్తున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి భద్రపర్చుకున్నాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని తన భార్యకు విడాకులు ఇస్తున్నానని, ఆమెను పెళ్లి చేసుకోమని బలవంతం చేశాడు. అప్పటికే సందీప్ స్త్రీలోలుడని, దురలవాట్లు ఉన్నవాడని గుర్తించిన మహిళ తనకు ఇష్టం లేదని తెగేసి చెప్పింది. దీంతో సందీప్ దాచిపెట్టుకున్న ఫొటోలతో పాటు మరికొన్ని ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆమెకే పంపాడు. ఆమె ప్రశ్నించగా తనతో ఉంటే ఫొటోలు ఎవరికి పంపనని లేదా సోషల్ మీడియాలో పెడతానని చెప్పాడు. బాధితురాలు లొంగకపోయేసరికి బంధువులందరికీ ఆ ఫొటోలను పంపాడు. ఆమె నుంచి ఏ స్పందన లేకపోయేసరికి శనివారం రాత్రి ఆ ఫొటోలను బాధితురాలి కొడుకైన మైనర్ బాలుడికి పంపించాడు. ఫోన్ చేసి మరీ బాలుడికి చెప్పాడు. బాలుడు ఫొటోలు చూసి మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి ఆ బాలుడు ఇంటి నుంచి బయటకు వచ్చేసి నేను తట్టుకోలేకపోతున్నాను బ్రతకనని చెప్పి వెళ్లిపోయాడు. బంధువులు ఆ బాలుడి కోసం గాలించి ఆదివారం గుర్తించారు. సందీప్ అకృత్యాలు తాళలేకపోయిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. రాష్ట్ర మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశాడు. సందీప్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగదుర్గారావు తెలిపారు.

## వాడపల్లి వెంకన్నకు బంగారు ఆభరణాలు సమర్పణ

ఆత్రేయపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి ఓ అజ్ఞాత భక్తుడు 107 గ్రాముల బంగారు ఆభరణాలను సమర్పించాడు. శనివారం రాత్రి స్వామిని దర్శించుకున్న భక్తుడు 90 గ్రాముల కంఠాభరణం, 17 గ్రాములతో బంగారు గొలుసు సుమారు రూ.11లక్షల విలువైన వస్తువులను సమర్పించాడు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించనున్నారు.

## శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పపూజ



లిల్లీ పుష్పపూజ అనంతరం ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

పిఠాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదులకు సహస్ర లిల్లీ పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మములకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గోపూజ, పల్లకీసేవ జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసీదళాలుతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### నేడు, రేపు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదల



మలికిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెన మరమ్మతులు నిర్దేశిత గడువులోగా పూర్తి కాని దృష్ట్యా మరో 2 రోజుల పాటు వంతెనపై పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేయనున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వంతెన వద్ద బేరింగ్ రీప్లేస్ పనులు, ట్రాఫిక్ బ్లాక్ నియంత్రణ కోసం ఈ నెల 25, 26న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. దిండి-చించినాడ 216 జాతీయ రహదారిపై పర్యటించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

### నేటి నుంచి సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు

అంతర్వేది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదల నేపథ్యంలో 3 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సోమవారం నుంచి సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పంటు రాకపోకలు ప్రారంభంకానున్నాయి. ప్రయాణాలు సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు.

### 31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్షిప్ సెమినార్

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సమీపంలోని ఎస్‌విపిసి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్షిప్ సెమినార్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ మెంబర్షిప్ కమిటీ చైర్మన్ చోడిశెట్టి పద్దరాజు తెలిపారు. కాకినాడ రోటరీ హాల్‌లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ప్రత్యేక సమావేశం ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పద్దరాజు మాట్లాడుతూ సెమినార్‌కు కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు అన్ని రోటరీ క్లబ్‌ల సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మాచారెడ్డి ప్రతిపాదించిన రవి సోలార్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత రవీంద్రనాథ్‌రెడ్డికి రోటరీ సభ్యత్వం పిన్ను అందజేశారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయచక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న పది మంది అరెస్ట్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి తోటల్లో పేకాట శిబిరంపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నాగార్జున ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. 10 మందిని అరెస్ట్ చేసి రూ.41 వేలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.



## కానుగ.. కొన ఊపిరితో నిలిచెగ!

కొన ఊపిరితో అంటూ అప్పుడప్పుడూ వింటుంటాం.. దానికి ఈ కానుగ వృక్షం తార్కాణంగా నిలిచింది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని వైఎస్ఆర్ నగర్‌లో నీడనిచ్చే కానుగ వృక్షాన్ని విద్యుత్ సిబ్బంది కొమ్మలకు బదులు మొదలు నరికేశారు. కాండం మొత్తం తెగిపడగా బెరడు మాత్రం మిగిలిఉంది. ఆ బెరడు(కొన)తో కానుగ వృక్షం చిగిరించింది. కొన ఊపిరితో (జీవించడం) చిగురించించడం ఇదేనేమో.. ఈ వృక్షం చూపరులను ఆశ్చర్యపరుస్తుంది..

ఆంధ్రజ్యోతి, -రామచంద్రపురం (ద్రాక్షారామ)

## గుర్తుకొస్తున్నాయి...

రామచంద్రపురంలో...



కొత్తపేటలో...




### 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కొత్తపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో 1975 నుంచి 78 వరకు బీఎస్సీ విద్యను అభ్యసించిన 50 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం బుచ్చిరాజు కల్యాణవేదికపై అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు కె.నాగరాజకుమారిని సత్కరించారు. వీఎస్ఎం ప్రిన్సిపాల్ అన్సారీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు కామేశ్వరరావు, డా.చెలికానిస్టాలిన్ వారికి అభినందనలు తెలిపారు. పూర్వవిద్యార్థులు హైకోర్టు న్యాయ వాది సార్వభౌమారావు, విశ్రాంత న్యాయమూర్తి కామేశ్వరి దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 మధ్య ఇంటర్ చదువుతున్న అప్పటి విద్యార్థులు సుమారు 50 ఏళ్ల తరువాత ఆదివారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. పాతజ్ఞాపకాలు గుర్తుకుతెచ్చుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో ఇక్కడ చదివిన విద్యార్థిని యూఎస్ఏలో డాక్టర్‌గా పనిచేస్తుండగా ఆ దంపతులను, ఇక్కడ అధ్యక్షుడిగా కార్యక్రమాలు నిర్వహించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం- అనంతకుమారి దంపతులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీ భాణి, కె.ప్రసాదవర్మ, పప్పుల వీరభద్రరావు, సత్యవరపు సత్యనారాయణ, ముత్యాల మాధవరావు, కేతినీడి సత్యనారాయణమూర్తి, పెంటా బాస్కరరావు, జి.కృష్ణ, ఆర్.రామారావు, కె.రాజేశ్వర్, అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు,భీమాల వెంకటేశ్వరరావు ఉన్నారు.

### కోడిపందాలపై పోలీసుల దాడి

అల్లవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలో కోడిపందాల శిబిరంపై అల్లవరం పోలీసులు దాడి చేశారు. ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా 30మంది అక్కడి నుంచి పారిపోయినట్టు సమాచారం.

### మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయ వంతం చేయాలని బీజేపీ నాయకుడు కోనా సత్యనారాయణ కోరారు. సోమవారం మాధవ్ అమలాపురం వస్తున్నారని చెప్పారు. అమలాపురం లో జరిగే మాధవ్ సభకు బీజేపీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఎన్నికల కమిషనర్ రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలి

- ఎన్నికల కమిషనర్ తీరుపై రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మలికిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్‌పై విమర్శలు రావడం విచారించదగ్గ విషయమని భారత ఎన్నికల వ్యవస్థ, ఎన్నికల కమిషనర్ తీరు తెన్నులపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మలికిపురం ఫూలే-అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రాజ్యాంగ బద్ధంగా ఉండాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అభిప్రాయపడ్డాయి. స్వేచ్ఛా, స్వతంత్ర భావ ప్రకటన వేదిక నాయకులు జనిపల్లి సత్యానందం, ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్ష, కార్యవర్గంగా వ్యవహరించిన సమావేశంలో బీహార్‌లో 65లక్షల మంది ఓటర్లను ఓటరు లిస్టు నుంచి తొలగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న సమయంలో ఎన్నికల కమిషన్ తీరు సహేతుకంగా లేదన్నారు. ఒకే ఓటరు అనేక బూత్‌ల్లో ఓటరుగా నమోదు కావడం, బతికున్న ఓటరు చనిపోయినట్టుగా ఓటరు జాబితా నుంచి తొలగించడం ఎన్నికల వ్యవస్థకు మాయని మచ్చ వంటిదన్నారు. ఎన్నికలు బ్యాలెట్ ద్వారా జరగాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరగకపోతే ప్రజాస్వామ్యం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు పలు అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సరెళ్ల ప్రసన్నకుమార్, మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూసు జాన్‌మోషే, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, దేశినీడి భాస్కరరావు, నల్లి ప్రసాద్, అబ్దుల్‌రహీమ్, చింతా సత్య తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు కృషిచేయాలి



రాజ్యాంగ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న పరిరక్షణ సమితి

ముమ్మిడివరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని ముమ్మిడివరం నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. ముమ్మిడివరం మండలం గాడిలంక, అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని పెదపేట, చిన్నపేట, రాంజీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. వీటిని తిప్పి కొట్టాలంటే గ్రామాల్లోని బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు, మహిళలు సంఘటితమై రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యమైన పాత్ర పోషించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెట్టా శ్రీనివాస్, ఇసుకపట్ల పాపారావు, తాటిపాక దుర్గబాబు, యలమంచిలి సురేష్, కుంచే చినబాబు, శరత్‌లతో పాటు ఆయా గ్రామాలకు చెందిన వరసాల సత్యనారాయణ, పాము శ్రీనివాసరావు, రేవు రాంబాబు, దానంకోట వేణుగోపాలస్వామి, గిడ్డి భాస్కర్, గుత్తాల వెంకటేశ్వరరావు, పంతగడ వెంకటేశ్వరరావు, బీర సుబ్బారావు, కాశి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## రామేశ్వరం మొగలో తవ్వకాలు ప్రారంభం



అల్లవరం మండలం రామేశ్వరం మొగలో ఇసుక మేట తవ్వకాలు

అల్లవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలోని 30వేల ఎకరాల ఆయకట్టులో ముంపు నీరు దిగడానికి ఇసుక మేటలతో అవరోధంగా ఉన్న రామేశ్వరం మొగలో రెండు రోజులుగా తవ్వకాలు ప్రారంభమయ్యాయి. అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం మొగ నుంచి సముద్రంలోకి ముంపు నీరు దిగడానికి వీలుగా 200ప్రొక్లయిన్‌తో తవ్వకాలు ప్రారంభించారు. డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ పర్యవేక్షణలో తవ్వకాలు జరుగుతున్నాయి. శుక్రవారం రామేశ్వరం మొగ వద్ద ఇసుక మేట తొలగింపు పనులు ప్రారంభించామని అల్లవరం వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ దాట్ల గోపీరాజు తెలిపారు. ఈఇసుక మేటల్లో తొలగింపు వల్ల ముంపు నీరు దిగడానికి మోక్షం కలుగుతుందని డ్రెయిన్స్ ఏఈ కె.సునీత తెలిపారు. మరో రెండు రోజుల్లో మొగ తవ్వకాలు పూర్తవుతాయన్నారు. ప్రతీ ఏటా ఇసుక మేటలు వేసి మూసుకుపోతున్న మొగకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

### మట్టి గణనాథులను పూజిద్దాం

అంబాజీపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మట్టి గణనాథులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామంటూ పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు అన్నారు. ఇరుసుమండలో కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపకుడు వీరంశెట్టి ఆధ్వర్యంలో సమకూర్చిన మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా అందించారు. నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.

# లంక గ్రామాలను వీడని ముంపు

- మునిగిన వాణిజ్య పంటలు
- వరద నీటిలో అప్పనపల్లి కాజ్‌వే







ముమ్మిడివరం: గురజాపులంకలో పాడైన వంగతోట, పి.గన్నవరం: కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై రాకపోకలు, ముమ్మిడివరం: అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీటిలో ప్రయాణాలు

ముమ్మిడివరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గినా దిగువన ఉన్న లంక గ్రామాలు ముంపు నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. అయితే అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోని భూములు వరద నీటిలోనే ఉన్నాయి. ప్రధాన రహదారులు ముంపు నుంచి బయటపడ్డాయి. వివేకానంద వారధి, గురజాపులంక సీసీ రోడ్డు వరద నీటి నుంచి పూర్తిగా బయటపడింది. కూనాలంక రామాలయం వద్ద కూడా రోడ్డు వరద ముంపు నుంచి బయటపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు వెసులుబాటు కలిగింది. గోదావరి అవతల ఉన్న లంక భూముల్లో రైతులు రాకపోకలు సాగించేందుకు గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక వద్ద ఏర్పాటుచేసిన మెకనైజ్డ్ బోట్లు కొనసాగుతున్నాయి. లంక గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాలు, తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతుంది. లంకగ్రామాల్లో మండలస్థాయి అధికారులు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య లంక గ్రామాల్లో పర్యటించి అధికారులకు సూచనలిచ్చారు. ముంపు వీడిన వెంటనే శానిటేషన్ నిర్వహించాలని తహశీల్దార్ ఆదేశించారు.

**వాణిజ్య పంటలు మునక**

లంక భూముల్లో సాగు చేసిన వాణిజ్య పంటలను వరద ముంపు నష్టానికి గురిచేసింది. శుక్రవారం వరద నీరు లంక భూములను ముంచెత్తడంతో లంక భూముల్లో సాగుచేసిన కూరపాదులు నీట మునిగాయి. కమిని పంచాయతీ పరిధిలో గురజాపులంకలో 300ఎకరాలు, లంకాఫ్ ఠాణేలంకలో 260, లంకాఫ్ గేదెల్లంకలో 50ఎకరాల్లో సాగుచేసిన మునగ, ఆనబ, వంగ, మిర్చి, బెండ, చిక్కుడు వంటి పంటలు దెబ్బతిన్నట్టు రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.30వేల నుంచి రూ.50వేలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది. వరద ముంపు తగ్గిన వెంటనే వాణిజ్య పంటల నష్టాలను సర్వేచేసి నమోదు చేస్తామని తహశీల్దార్ టి.సుభాష్ తెలిపారు.

### నీటిలోనే కనకాయలంక కాజ్‌వే

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉగ్రరూపం దాల్చి ఇప్పుడిప్పుడే శాంతిస్తుంది. ఎగువన వరద తగ్గుముఖం పట్టడంతో దిగువన ధవళేశ్వరం వద్ద 5లక్షల క్యూసెక్కులు వరదనీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దిగువన ఉన్న నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే జలదిగ్బంధంలోనే ఉంది. లంక గ్రామస్తులు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కె.ఏనుగుపల్లి, గంటిపెదపూడి దిగువన ఉన్న కాజ్‌వేలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి. దీంతో లంకగ్రామాల ప్రజలకు కాస్త ఉపసమనం లభించింది. మానేపల్లి శివారు శివాయిలంకకు రహదారి ముంపు నుంచి బయటపడటంతో స్థానికులు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. నాగుల్లంక శివారు గుడ్డాయిలంకలో వరిచేలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. పి.గన్నవరం నుంచి గంటిపెదపూడి వరకు ఉన్న లంకలతో పాటు మానేపల్లి పరిసర ప్రాంతాల్లో లంకపొలాల్లో ఉన్న కూరగాయలు పంటలు, అరటి, బొప్పాయి, కోకో తదితర పంటలు వరద ముంపున పడ్డాయి. గంటిపెదపూడి, ఉడిమూడి పరిధిలో ఉన్న నాలుగు లంకగ్రామాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

### తగ్గుముఖం పట్టిన వరద

అంతర్వేది, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరిగిన వరదలతో లంకప్రాంతాలకు స్వల్పంగా వరద నీరు చేరింది. రెండు రోజుల పాటు కొద్దిపాటి వరద నీటికి ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. ఆదివారం ఉదయం నాటికి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

### తగ్గిన వైనతేయ వరద

అల్లవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పోటెత్తిన వైనతేయ వరద తగ్గుముఖం పట్టింది. సుమారు 20ఇళ్లు వరద నీటిలోనే ఉన్నాయి. సుమారు 280మంది వరద బాధితులకు ఆహార పొట్లాలు అందజేశారు. తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఎంపీడీవో బి.లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆదిశంకరం, వీఆర్వో యు.చిట్టిబాబు, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు వరద ప్రాంతంలో పర్యటించి బాధితులకు అండగా నిలిచారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బోడసకుర్రు పల్లిపాలెంలో ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలు అందిస్తున్నారు.

### అప్పనపల్లి కాజ్‌వేపై వరద

మామిడికుదురు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మూడు లంక గ్రామాలకు రహదారిగా ఉన్న అప్పనపల్లి కాజ్‌వే ఇంకా వరద నీటిలోనే ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేలోని వరద నీటిలోనే వాహనదారులు, స్థానికులు ఇబ్బందుల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. మామిడికుదురు నుంచి కొర్లగుంట, ఉచ్చులవారిపేట వరకు వరద నీటిలోని సీసీ రోడ్లు ముంపు నుంచి తేరుకున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు చెందిన ప్రజలు ఆ మార్గాం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మూడు రోజులు కాయగూరల తోటల్లో వరద తిష్ట వేయడంతో పంటలు పాడైపోయి అపార నష్టం వాటిల్లే ఆస్కారంఉందని కాయగూర పంట రైతులు వాపోతున్నారు. సోమవారానికి పూర్తిస్థాయిలో వరద తగ్గుముఖం పట్టే ఆస్కారం ఉందని లంక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

### ఈపీఎస్-95 పెన్షనర్లకు రూ.9వేలు పెన్షన్ చెల్లించాలి

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అమలాపురంటౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ఈపీఎస్-95 పెన్షనర్లకు డీఏతో కలిసి కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించడంతో పాటు హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కడలి సత్యనారాయణ, గుబ్బల గోపాలకృష్ణ తెలిపారు. ఈపీఎస్‌వో తిరస్కరించిన 14.5లక్షల హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను పునఃపరిశీలన చేయాలన్నారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో ఆదివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీని నియమించి మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఈపీఎస్-95 పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.వెంకటేశ్వరరావు, వి.భానోజీరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీపీఎస్ సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, కె.సురేష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

## కనుమరుగవుతోన్న మత్స్యసంపద

ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి



మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యానాం సముద్రగర్భంలో చమురు సంస్థలు నిర్వహిస్తోన్న కార్యకలాపాల వల్ల యానాంతో పాటు పరిసర ప్రాంతాల్లో వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఉపాధిలేక తీవ్రంగా నష్టపోవడంతో పాటు మత్స్య సంపద కనుమరుగవుతోందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానిక అగ్నికులక్షత్రియ కల్యాణ మండపంలో యానాం, కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో మల్లాడి మాట్లాడారు. యానాం ఐలాండ్ నెం-3 మీదుగా వెళ్లిన గ్యాస్‌పైప్‌లైన్ లీక్ కావడంతో పెద్దఎత్తున్న మంటలు చెలరేగడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారన్నారు. ఈగ్యాస్ పైప్‌లైన్ లీక్ ద్వారా విడుదలైన ఆయిల్, గ్యాస్ వల్ల సముద్రం, గోదావరిలో మత్స్య సంపద పూర్తిగా దెబ్బతినడమే కాకుండా రాను రాను పూర్తిగా నశించిపోతుందన్నారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంకు జరిగిన సంఘటన, నష్టపరిహారం అంశాన్ని వివరించానన్నారు. యానాం, ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించి, నివేదికను తయారు చేయడానికి పుదుచ్చేరి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈవిషయంపై అమలాపురం ఎంపీ, ముమ్మిడివరం, కాకినాడ ఎమ్మెల్యేలతో కలిసి కాకినాడ కలెక్టర్‌కు నష్టపరిహారంపై నివేదికతో పాటు వివిధ గ్రామాల ప్రతినిధులతో వినతిపత్రం అందిస్తానన్నారు. ప్రజలకు రక్షణతో పాటు పరిహారం అందేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతు ఈసంఘటనకు సంబంధించిన అన్ని అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశానన్నారు. ముమ్మిడివరం పరిసర ప్రాంతాల మత్స్యకారులకు పరిహారం అందేవరకు మల్లాడి, ఎంపీ హరీష్‌తో కలిసి ముందుకెళ్తానన్నారు. యానాం, కోటిపల్లి, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ ప్రాంతాల మత్స్యకారులు, గ్రామాల ప్రతినిధులు, ఇతర కులాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

### మురుగునీటి డ్రైన్ ఆక్రమణ

ఐ.పోలవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేశనకుర్రులో ప్రధాన డ్రైన్ ఆక్రమణలకు గురవుతోందని కొందరు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పంట పొలాల్లోని మురుగునీరు దిగే డ్రైన్ ఆక్రమణలకు గురవుతోందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. డ్రైన్‌ను మట్టితో పూడ్చి ఆక్రమించుకోవడంతో డ్రైన్ స్వరూపం మారిపోయి ముంపునీరు దిగేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి అనుసంధానంగా ఉండే మురుగునీటి కాల్వలను పరిరక్షించుకోవలసిన అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు డ్రైన్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన కేశనకుర్రు ప్రధాన డ్రైన్

### రూ.4లక్షల ఉపకార వేతనాలు

కాపు ఉద్యోగ సేవాసమితి సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



సమనసలో కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అమలాపురం రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల విద్యార్థుల అభివృద్ధికి కులసంఘాలు, సేవా సంఘాలు ఇతోధికంగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. నిరుపేద కాపు విద్యార్థులను ఆదుకునేందుకు ఏటా కోనసీమ కాపు ఉద్యోగ సేవాసమితి ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందించడంతో పాటు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఆదివారం రాత్రి సమనస డిల్లీ పబ్లిక్ స్కూలులో సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లా రామకృష్ణ, పిండి శివమారుతీ వరప్రసాద్ ఆధ్వర్యంలో 40మంది కాపు పేద విద్యార్థులకు రూ.5వేలు చొప్పున రూ.4లక్షల ఉపకార వేతనాలను ఎమ్మెల్యే అందజేశారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆకుల రామకృష్ణ, త్సవటపల్లి నాగేంద్రలు సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నల్లా విష్ణుమూర్తి, లింగోలు పండు, యాళ్ల నాగసతీష్, యాళ్ల దొరబాబు, సేవాసమితి ప్రతినిధులు పోతంశెట్టి దొరబాబు, బోనం గంగాధర్, నంద్యాల నాయుడు, అన్యం రాంబాబు, వంగా అయ్యప్ప, వేమన సత్యనారాయణ, కురచ రామకృష్ణ, కోళ్ల స్వామినాయుడు, చిక్కం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 'పిల్లలకు బైక్ ఇస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్'

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను అతిక్రమించి మోటారు బైకులు నడిపితే వారి తల్లిదండ్రులకు సైతం కౌన్సిలింగ్ తప్పదని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన విద్యార్థులకు ఆదివారం ఆర్టీవో కార్యాలయంలో శ్రీనివాసరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా విద్యార్థులు పట్టుబడితే ఇక నుంచి తల్లిదండ్రులు ఆర్టీవో కార్యాలయానికి కౌన్సిలింగ్ కోసం హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు. రహదారి భద్రత ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని శ్రీనివాసరావు హెచ్చరించారు.

### తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

అల్లవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని అల్లవరం తల్లిదండ్రులకు అప్పగించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీప ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలుడు మల్లిపూడి చిరు తప్పిపోయాడు. అల్లవరం మండలం బోడసకుర్రు వంతెన వద్ద తిరుగుతున్న బాలుడిని స్థానికులు పట్టుకుని అల్లవరం పోలీసులకు అప్పగించారు. అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ సమక్షంలో బాలుడు చిరును తల్లిదండ్రులు సతీష్, ఏసులక్ష్మిలకు అప్పగించారు.

### కేశనపల్లి హాస్టల్ తనిఖీ

మలికిపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేశనపల్లి సంక్షేమ వసతిగృహం అన్నంలో సీసా పెంకులు ఉన్నట్లు కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంఈవో-2 వై.సత్యనారాయణలు తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులను హాస్టల్ పరిస్థితిపై ఆరా తీశారు. ముగ్గురు విద్యార్థులు శుక్రవారం అన్నంలో సీసా పెంకులు వచ్చాయని తెలపగా మిగిలిన వారు తమకు అన్నం బాగానే ఉందని తెలిపారు. హాస్టల్‌లో 35మంది విద్యార్థులు ఉంటున్నట్టు వార్డెన్ డి.జ్యోతి తెలిపారు. హాస్టల్‌లో జరిగిన పరిస్థితులపై నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్టు తహశీల్దార్ చెప్పారు. యెనుముల నాగు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### లక్ష యూనిట్ల రక్త సేకరణే లక్ష్యం



అమలాపురం ఓం శాంతి కేంద్రంలో మెగా రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విశ్వబంధుత్వ దివస్‌ను పురస్కరించుకుని అమలాపురం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. రవణంవీధిలోని హార్మోని హాస్‌లో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి మాట్లాడుతూ ఓంశాంతి రాజయోగిణి దాదీ ప్రకాష్‌మణిపవిత్ర స్మరణార్థం విశ్వబంధు దివస్‌ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. అన్ని బ్రహ్మకుమారీల కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తసేకరణ లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 50వేల యూనిట్ల రక్త సేకరణ చేశామన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ నిత్యం ఎన్నో ఒత్తిళ్లకు గురై బిజీ జీవితాలను గడిపేవారు ఈకేంద్రానికి వస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు, లయన్స్ క్లబ్, ఆరోగ్య కుటుంబ మంత్రిత్వశాఖల సహకారంతో అమలాపురంలో నిర్వహించిన శిబిరంలో 108మంది రక్తదానం చేశారు. వారికి బీకే శ్రీదేవి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, చిరంజీవి బ్లడ్ డోనర్స్ ప్రతినిధులు నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సత్రం చైర్మన్ పవన్‌కు సన్మానం

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం మంత్రిప్రగడవారి సత్రం చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గొర్తి పవన్‌ను ఆదివారం తెలంగాణ పోలీసు కంప్లయింట్స్ అథారిటీ చైర్మన్ జస్టిస్ బులుసు శివశంకర్ ఘనంగా సత్కరించారు. శివశంకర్ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సేవా తత్పరుడైన పవన్‌ను చైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకుడు కొత్తూరి శ్రీనివాస్, ఆకెళ్ల నారాయణమూర్తి, కళా వెంకట్రావు, జిల్లెల్ల గోపాల్, గొర్తి దుర్గ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, భమిడిపాటి శ్రీరామ్, కొత్తూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ఇమామ్ అలీరజాకు ముస్లింల ఘన నివాళి



నగరంలో జరిగిన ఇమామ్ అలీరజా వర్ధంతిలో భాగంగా గుమ్మటాన్ని మోస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ముస్లింల ఆరాధ్య దైవం ఎనిమిదవ ఇమామ్ అలీరజాకు ముస్లింలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వర్ధంతిని పురస్కరించుకుని మామిడికుదురులోని ఇమామ్ అలీరజా పంజాలో మజ్లిస్ జరిగింది. అనంతరం పంజా నుంచి పీరును తీసి మాతం నిర్వహిస్తూ నగరంలోని పెదపంజీషా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈఊరేగింపులో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని గుమ్మటాన్ని భుజాన ఎత్తుకుని మోసి ముస్లింలకు సంఘీభావం ప్రకటించారు. మొహర్రం సంతాప దినాలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఈసందర్భంగా తెలిపారు. ఇరాన్‌లోని మషద్ పట్టణంలో ఇమామ్ అలీరజా వీరమరణం పొందిన సంఘటనలను మత ప్రబోధకుడు మౌలానా సయ్యద్ అంజాద్‌అలీజైదీ భక్తులకు వివరించగా భక్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పంజా ముతవల్లీ సర్కిలపకార్ సాహెబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మట్టి విగ్రహాలను పూజించాలి

మామిడికుదురు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయకఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజించాలని ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో పాశర్లపూడిలో ఆదివారం భక్తులకు మట్టి గణపతుల ప్రతిమలను ఉచితంగా అందించారు. మట్టి గణపతి మన గణపతి అనే పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించి మట్టివిగ్రహాలను పూజిస్తే కలిగే ప్రయోజనాలు వివరించారు. కటికిరెడ్డి శివనాగేంద్ర, వాణరాశి రాజేష్, కంకిపాటి శ్రవణ్, సూర్య పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



అంతర్వేది, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు రూ.1,01,116 విరాళాన్ని సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్‌కు అందించారు. దాతకు స్వామివారి చిత్ర పటం అందించారు.

### వరి పొలాల్లో ముంపు నీరు ఉండకూడదు: ఎమ్మెల్యే

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వరి పంట పొలాల్లో చుక్క నీరు లేకుండా బయటకు పోయేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పోతవరం ముగ్గుబట్టీలు వద్ద ముంపునీరు దిగేవిధంగా చేస్తున్న పూడికతీత పనులను ఆదివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ముగ్గుబట్టి పరిసరాల్లో కాస్త వర్షం వస్తే చాలు చేలన్ని ముంపునకు గురవుతాయని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. 150ఎకరాల ఆయకట్టు రైతుల దీర్ఘకాలిక సమస్యకు ప్రస్తుతం తాత్కాలిక పరిష్కారం చేస్తున్నామని, వచ్చే వేసవిలో శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పూడికతీత పనులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. డ్రైన్‌లో పూడికతీత పనుల్లో భాగంగా కాంక్రీక్ గోడను పగులగొట్టి నీరు దిగే ఏర్పాటుచేశారు. కూటమి నాయకులు ఉన్నారు.


### గోవుల తరలింపును అడ్డుకున్న బీజేపీ

అల్లవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని ఎన్.రామేశ్వరంలో గోవులను తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. సమనస గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తీర గ్రామాల్లోని పశువులను వాహనాలపై ఎక్కించి కబేళాకు తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకుని పోలీసుస్టేషనలో ఫిర్యాదు చేశామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అంగాని ధనుంజయవర్మ అన్నారు. ధనుంజయ వర్మతో పాటు చక్కా రామకృష్ణ, కొల్లు రాంబాబులు గోవులను తరలించకుండా అడ్డుకున్నారు.

### వాకర్స్ క్లబ్ సమావేశం

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో వాకర్స్ క్లబ్ మండల అధ్యక్షుడు తోలేటి సుబ్బారావు అధ్యక్షతన వాకర్స్ క్లబ్ సమావేశం జరిగింది. ఈసమావేశానికి నడక కవి నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని నిత్యం నడక వల్ల కలిగే లాభాలను సభ్యులకు, స్థానికులకు వివరించారు. అనంతరం నరసింహమూర్తి రచించిన 117వ నడక నానీల పుస్తకం ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని సభ్యులు నల్లా పెద్దకాపు ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. నేలపూడి రామకృష్ణ, శ్రీకాకుళపు లక్ష్మీపతిరావు గుప్తా, వాసంశెట్టి అనంతలక్ష్మి, కొండా గీత, పిప్పళ్ల పరుశు రాముడు, కడలి పార్థసారధి, పాబోలు సత్యనారాయణ, శ్రీకాకుళపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### డీఎస్సీలో కృష్ణమనాయుడుకు 15వ ర్యాంకు



రాజోలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో రాజోలుకు చెందిన కర్రి దుర్గాకృష్ణమనాయుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. ఈయన 2018 డీఎస్సీలో 0.25 మార్కుల తేడాతో పోస్టు దక్కించుకోలేకపోయారు. ప్రస్తుతం కృష్ణమనాయుడు నగరంగ్రామసచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గాపనిచేస్తున్నారు.

### భర్తకు డీఎస్సీలో 30, భార్యకు ఎస్‌జీటీలో 274 ర్యాంకు



పి.గన్నవరం,ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): రాజులపాలెం గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి ప్రసాద్, శకునాల హేమచంద్రకళ దంపతులు డీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించారు. ప్రసాద్ 75.03 మార్కులతో డీఎస్సీ ఫిజిక్స్‌లో ఉమ్మడి జిల్లాలో 30వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం నవోదయ పాఠశాలలో ప్రైవేటు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. అతడి భార్య డీఎడ్‌లో 80.99 మార్కులతో ఎస్‌జీటీ 274ర్యాంకు సాధించారు. ఆమె గృహిణిగా ఉన్నారు.

### మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు కోనా సత్యనారాయణ కోరారు. సోమవారం మాధవ్ అమలాపురం వస్తున్నారని చెప్పారు. అమలాపురంలో జరిగే మాధవ్ సభకు బీజేపీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



రావులపాలెం టీడీపీ క్యాంప్ కార్యాలయం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

## ప్రతి ఏడాది డీఎస్సీపై హర్షం

రావులపాలెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నియామకానికి టీడీపీ చిత్తశుద్ధి తో పనిచేస్తున్నారన్నారు. డీఎస్సీ అంశం వచ్చాక ఇప్పటి వరకూ 16 నోటిఫికేషన్లు విడుదల కాగా వాటిలో 13 టీడీపీ పాలనలోనే జరిగాయన్నారు. గత పాలనలో నోటిఫికేషన్ విడుదల చేసినా ఎన్నికల కోడ్ కారణంగా అది రద్దు అయ్యిందన్నారు. వైఎస్ జగన్ తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులన్నీ భర్తీ చేస్తానని నిరుద్యోగులకు ఆశ కల్పించి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను విస్మరించారన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభి రామారావు, ముత్యాల బాబ్జి, కొప్పిశెట్టి ప్రసాద్, పల్లి ఏసు, కాసా విజయసాగర్, పెచ్చెట్టి చిన్నారావు, చిన్న కేవీ, సాధనాల శ్రీనివాస్, గెడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు



ఆలమూరు-జొన్నాడ రోడ్డు ఎస్ టర్నింగ్‌లో తొలగించిన పిచ్చిమొక్కలు

ఆలమూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు-జొన్నాడ రోడ్డులోని ఎస్ టర్నింగ్ వద్ద ప్రమాదాలు నివారించడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ టర్నింగ్ వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ చొరవతో ఎస్ టర్నింగ్‌లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించే చర్యలు చేపట్టారు. ఎస్.టర్నింగ్‌లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా పిచ్చిమొక్కలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా చర్యలు తీసుకోవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు ఎస్ఐ నరేష్ చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

# ఇంకా జలదిగ్బంధంలోనే..

**వరద ఉధృతి తగ్గుముఖం పట్టినప్పటికీ ఆయా లంక గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే కొనసాగుతున్నాయి. కె.గంగవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లోని అరటి, తమలపాకు, బొప్పాయి, కంద తదితర పంటలు ముంపుబారినపడి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. వరద నీటిలోనే ఆయా ప్రాంతవాసులు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు**



ఆలమూరు వద్ద గోదావరి ప్రవాహం

కె.గంగవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి సుమారు మూడు అడుగుల మేర తగ్గిందని స్థానికులంటున్నారు. పుష్కరాల రేవు, ఫెర్రీ రేవు ఇంకా వరద నీటిలో కొనసాగుతున్నాయి. గోదావరి ప్రవాహాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. దీంతో కోటిపల్లి రేవు సందర్శకులతో సందడిగా మారింది.

### తగ్గుతున్న వరద..

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మండలంలోని ఆయా లంక భూముల్లో వరద తగ్గింది. నాలుగు రోజులుగా ముంపుబారినపడిన ఆయా పంట భూముల్లోని వరద నీరు తగ్గింది. ఆయా ప్రాంత లంక రైతులు వరద ఉధృతి శాంతించడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో ఉన్న వాణిజ్య పంటలు కొంతమేర మునిగినప్పటికి అధిక శాతం పంటలకు నష్టం తక్కువగా ఉండవచ్చని రైతులు చెబుతున్నారు. మూలస్థానం వద్ద వరదనీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన కాజ్‌వే ప్రాంతంలో వరదనీరు కొనసాగుతోంది. దీంతో రావులపాలెం మండలం తోకలంకకు ఇంకా జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్‌లోని వరదనీరు క్రమంగా తగ్గుతోంది. జొన్నాడ వద్ద రెండు వంతెనల మధ్య వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

### తేరుకుంటున్న పంటలు

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** ఉధృతంగా పెరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. నదీ పరివాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాలతో పాటు లంక గ్రామాలైన కేదార్లంక, వీధివారి లంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల ప్రజలు వరద ఉధృతి తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. లంక గ్రామాల్లోని బొప్పాయి, కంద, అరటి, కూరగాయ, తదితర పంటలు ముంపు నీటిలో కొనసాగుతూ ఇప్పుడిప్పుడే వరద నీటి నుంచి బయటపడుతున్నాయి. వరదల కారణంగా చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన పంటలను త్వరితగతిన సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.





కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతిని తిలకిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకలో వరద ముంపు నుంచి బయటపడిన బొప్పాయి పంట



ఆత్రేయపురం మండలం ర్యాలిలో మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రాయవరంలో గణేష్ ఉత్సవ కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

## మట్టి వినాయకుడినే పూజిద్దాం

ఆత్రేయపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి అన్నపూర్ణ డే కేర్ హోమ్ వద్ద కేఎస్ఆర్ టెంట్‌హౌస్ అధినేత వెలగల కాశీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడదాం...మట్టి గణనాథులను పూజిద్దాం నినాదంతో ర్యాలీ జరిపారు. ఇంటింటా మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేశారు. చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలు ఎలా తయారు చేసుకోవాలో వర్క్‌షాపు నిర్వహించారు.

### ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** వినాయక చవితిని శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పిలుపునిచ్చారు. ఆదివారం రాయవరం పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేశారు. రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసే కమిటీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు ఉపయోగించాలన్నారు. ఉత్సవ మండపాల వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రి మండపాల వద్ద ఉండాలన్నారు. బాణసంచా, అశ్లీల నృత్యాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

**రామచంద్రపురం(ద్రాక్షారామ) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** రామచంద్రపురం పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో గణపతి ఉత్సవాలకు ఆదివారం రాటమూహూర్తం జరిపారు. గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి ఉదయం 9.15 గంటలకు రాటమూహూర్తం నిర్వహించారు. కార్యక్రమంలో నేల శ్రీను, శివ, రాజు, గమ్మల్ల రత్నం, పలువురు వైఎస్ఆర్ నగర్ వాసులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

### టీడీపీ నాయకుడికి ఉత్తమ సేవా పురస్కారం

కె.గంగవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చిల్లే నాగేశ్వరరావు చేసిన సేవలకు ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. రావులపాలేనికి చెందిన మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం రావులపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు సర్టిఫికెట్‌తో పాటు మెమోంటో అందజేశారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆదివారం రద్దీనెలకొంది. శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఏలూరుకు చెందిన ఇరగవరపు వీఎంఆర్‌డీ రాజు, వెంకటసుబ్బ దంపతులు రూ.1,10,116, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డేగల రాంబాబు, కోమల దంపతులు రూ.50,116 విరాళాలు అందజేశారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న ఆయా అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలమూరు నవజనార్దనస్వామి ఆలయ పాలకవర్గం

## అట్టహాసంగా ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆలమూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న నవజనార్దనస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఆలమూరు ట్రస్టు బోర్డు అధ్యక్షుడిగా బైరిశెట్టి రాంబాబుతోపాటు పలువురు డైరెక్టర్లు బొబ్బా రాంబాబు, ఎవీవీఎస్ఎన్ మూర్తి, కట్టా శ్రీనివాస్, కొప్పాడి జయరాజు, ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, దారా దుర్గాభవానీ, సబ్బవరపు రామాయమ్మ బాధ్యతలు స్వీకరించారు. వీరితో జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా బండారు శ్రీనివాస్‌తోపాటు పాలకవర్గ అధ్యక్షుడు రాంబాబు, సభ్యులకు వేదపండితులు ఆశ్వీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి పాపారావు, సంగిత సుభాష్, అత్తిలి సత్తిబాబు, సలాది జయప్రకాష్, వంటిపల్లి సతీష్ కుమార్, ఈదల నల్లబాబు, సలాది నాగేశ్వరరావు, నల్లా వెంకన్న, చేకూరి కృష్ణంరాజు, గారపాటి శ్రీనివాస్, చల్లా బాబీ, డీపీ రావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాణి

### పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం మున్సిపాల్టీలో పనిచేసే 140 మంది పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు వైసీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్‌లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



### నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు రూ.1,01,116 విరాళాన్ని సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్‌కు అందించారు. దాతకు స్వామివారి చిత్ర పటం అందించారు.



పురస్కారం అందుకుంటున్న నేను సైతం టీమ్ అధ్యక్షుడు కిషోర్, సభ్యులు

## మదర్‌థెరిసా సేవా పురస్కారాలు అందజేత

రావులపాలెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీలో మదర్‌థెరిసా ఎడ్యుకేషన్ ట్రస్టు ఫౌండర్ డాక్టర్ దిద్ద కిషోర్ ఆధ్వర్యంలో మదర్‌థెరిసా జాతీయ సేవా పురస్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఆర్సీ రూపశిల్పి డాక్టర్ విక్టరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, శిల్పి వడయార్ పాల్గొని వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవలు అందించిన సుమారు 70 మందికి పురస్కారాలు అందచేసి సత్కరించారు. రావులపాలానికి చెందిన నేను సైతం టీమ్ అధ్యక్షుడు అంబటి కిషోర్, సభ్యులు, పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల పవన్ కుమార్‌రెడ్డి, సభ్యులతో పాటు పలువురు మదర్‌థెరిసా జాతీయ పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో సీఆర్సీ కార్యదర్శి వీరరాఘవరెడ్డి, సీఐ రమణమ్మ, సీఆర్సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ శ్రీధర్ తదితరులు

## పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండపేట ఏడీఈ సీహెచ్ శ్రీధర్ కోరారు. ఆదివారం పసలపూడి గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు 400 మంది సూర్యఘర్ పథకానికి దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూ 1లక్షా 40 వేల విలువైన సోలార్ ప్యానల్స్ వినియోగదారుడి ఇంటిపై ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తొలుత పీఎం సూర్యఘర్ పథకంపై గ్రామంలో ఇంటింటా ప్రచారానికి ఏడీఈ శ్రీకారం చుట్టారు. ప్రజలకు సూర్యఘర్ పథకం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.శ్రీనివాసరావు, రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న కుర్రావారికొండ ఇళ్ల స్థలాలు

### చినుకుపడితే..చెరువే

**గత ప్రభుత్వ నిర్వాకంపై అసంతృప్తి**

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం శివారు కుర్రావారి కొండను జగనన్న కాలనీ పేరిట గత ప్రభుత్వ హయాంలో పంపిణీకి సిద్ధం చేశారు. అప్పట్లో ఆ స్థలాల కోసం కొండను తవ్వారేతప్ప ఇప్పటి వరకు పంపిణీ జరగలేదు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆ స్థలాలు చిన్నపాటి వర్షానికే ఇలా చెరువును తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై ఆయా లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### క్వారీ లారీలతో ధ్వంసమవుతున్న రోడ్లు

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) ద్వారపూడి - జెడ్.మేడపాడు మధ్య వున్న రోడ్డు క్వారీ లారీల కారణంగా ధ్వంసమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ధ్వంసమవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జెడ్.మేడపాడు నుంచి అనేక మంది వివిధ పనుల కోసం ద్వారపూడి రాకపోకలు సాగిస్తుంటారని వారంటున్నారు. గోతులమయంగా మారిన రోడ్డుకు త్వరితగతిన మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ద్వారపూడి-జెడ్.మేడపాడు మధ్య క్వారీ లారీల వల్ల ధ్వంసమైన రోడ్డు



వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

## చవితి ఉత్సవాలను భక్తిభావంతో జరుపుకోవాలి

మండపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని భక్తి భావంతో జరుపుకోవాలని మండపేట రూరల్ సీఐ పితల దొరరాజు నిర్వాహకులను కోరారు. ఆదివారం మండపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో వినాయక చవితి కమిటీ నిర్వాహకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వినాయక పందిళ్లకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. విద్యుద్దీపాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో నిర్వాహకులు పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆయన అన్నారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలతోపాటు రాత్రి సమయాల్లో కమిటీ సభ్యులు రక్షణగా ఉండాలన్నారు. వినాయక చవితిని సంప్రదాయ బద్ధంగా, భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద స్థానికులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డుగా వినాయక మండపాలు ఏర్పాటు చేయవద్దన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ కిషోర్, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మడికి-గాంధీనగరం రోడ్డు నిర్మాణానికి నిధులు

**• నెరవేరిన ఎన్నికల హామీ • ఎమ్మెల్యే బండారుకు కృతజ్ఞతల వెల్లువ**

ఆలమూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలోని మడికి-గాంధీనగరం రహదారికి ఎట్టకేలకు మహర్దశ పట్టింది. కొన్నేళ్లుగా ఈ రోడ్డు సౌకర్యవంతంగా లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మడికిలో నిర్మించిన కృష్ణుడి ఆలయం జంక్షన్ నుంచి చిలకలపాడు మీదుగా గాంధీనగరం వరకు ఉంటుంది. చిలకలపాడులో రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉండటంతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. చెముడులంకను ఆనుకొని ఉండే గాంధీనగరం నుంచి చిలకలపాడు వెళ్లడానికి అక్కడి నుంచి మడికి వెళ్లడానికి సరైన రోడ్డు సదుపాయం లేదు. గోతులతో వర్షం వస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎమ్మెల్యే నాబార్డు నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డును పూర్తిగా సిమెంట్‌తో నిర్మించనున్నారు. ఈ ప్రాంతవాసులకు ఈ రోడ్డు ద్వారా ఎంతో ప్రయోజనకరంగా మారనున్నది. ఈ రోడ్డులో కొన్నిచోట్ల ఆరుమీటర్ల వెడల్పు లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజ లు సహకరిస్తే త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి కానున్నది. ఈ రోడ్డు అభివృద్ధి జరిగితే నేరుగా మండపేట-దుళ్ల రోడ్డుకు వెళ్లడానికి వీలు కలుగుతుంది.



అధ్వానంగా ఉన్న గాంధీనగరం-మడికి రోడ్డు దుస్థితి